నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్‌లో దాఖలైన అర్జీల పురోగతిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన వెల్లడించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పింఛను కోసం ఎదురు చూపు

కొత్త పింఛన్ల కోసం వేల మంది నిరీక్షణ
కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
పట్టించుకోని కూటమి ప్రభుత్వం
ఆధారం లేక బాధితుల అగచాట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల్లో విజయం సాధించడం కోసం కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేసేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పెద్దలు ఇచ్చిన వాగ్దానాలపై కనీసంగానైనా నోరు మెదపడం లేదు. దీనిలో భాగంగానే కొత్త పెన్షన్ల వ్యవహారం కూడా ఉంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోవడంతో కొత్త పెన్షన్లకు దరఖాస్తులకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వేలాది మంది బాధిత లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదు.

జిల్లాలో ఒఎపి పెన్షన్లు 1,30,826, వితంతువులు 73,725, వికలాంగులు 34,716, ఒంటరి మహిళలు 7,795 మంది, మత్స్యకారులు 6,236 మంది, కల్లుగీత 3,378 మంది, చేనేత 3,411 మంది, ఆరోగ్య సిబ్బంది 783 మంది, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు 1,843 మంది, డప్పు కళాకారులు 1,568 మంది, సికెడియు ప్రైవేటు 361 మంది, అభయహస్తం 6,053 మంది, సికెడియు ప్రభుత్వం 119 మంది, ట్రాన్స్ జెండర్స్ 108 మంది, కళాకారులు 96 మంది, సైనిక్ వెల్ఫేర్ పెన్షన్లు 18 మందికి మొత్తంగా 2,71,039 మందికి రూ.116 కోట్ల 88 లక్షల 89 వేలు పెన్షన్లు ప్రతి నెలా జిల్లాలో పంపిణీ చేస్తున్నారు.

2023 నుంచి తెరుచుకోని వెబ్‌సైట్

కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనేకమంది అర్హులు ప్రభుత్వాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచీ ఇబ్బందులు ఉన్నాయి. 2023 నవంబర్ తర్వాత వెబ్‌సైట్ తెరుచుకోని కారణంగా పాట్లు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు పైనే కావస్తున్నా పింఛనుదారుల సమస్యలను పట్టించుకోవడం లేదు. వితంతువులు, వృద్ధులు, వికలాంగులు ఇలా అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకా సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. గ్రామాల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతి నెలా పింఛన్లే ప్రధాన ఆధారం. రెక్కాడలేని అనేకమంది పింఛన్ సొమ్ముపైనే జీవనాధారం పొందుతున్నారు. కుటుంబ సభ్యుల ఆదాయం అంతంత మాత్రమే ఉండడంతో వీరి పోషణ కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచే పింఛను సొమ్ము చాలా కీలకంగా మారుతుంది. కూటమి అధికారులకు వచ్చినప్పటికీ కొత్త పెన్షన్ల ఊసెత్తడం లేదు. పైగా ఉన్న పింఛన్లలోనే కోతలు విధిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

అర్హత ఉన్నా...

గత ప్రభుత్వ హయాంలో రెండు మూడు నెలల వ్యవధిలోనే కొత్త పెన్షన్లు మంజూరుకు అవకాశం ఉండేది. వితంతు పింఛన్ల విషయంలో భర్త చనిపోయిన తర్వాత డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో సమర్పించిన కొద్ది నెలలకే పింఛన్ మంజూరు చేసేవారు. భర్తలు చనిపోయి ఏడాది, రెండేళ్లు కావస్తున్నా ఇంకా పింఛన్లు మంజూరు కాక వందలాది సంఖ్యలో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వృద్ధులు కూడా పింఛన్లు మంజూరు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం మందుల ఖర్చుకైనా పింఛన్ డబ్బులు పనికొస్తాయని ఆశిస్తున్నారు.

మండలానికి వెయ్యి మందికి పైనే..

50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్లు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అనేకసార్లు హామీలు ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీలకు ఇది వర్తిస్తుందని చెప్పుకొచ్చారు. కానీ ఇప్పుడు ఆ హామీని మరిచిపోయారు. 60 ఏళ్ల నిండిన వారికి సైతం పెన్షన్లు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ప్రతి మండలానికీ వెయ్యి మందికి పైనే వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్ల అర్హులు ఉన్నారు. ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో పెన్షన్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం ఆయా ప్రాంతాలకు వస్తున్న ప్రజా ప్రతినిధులను అడుగుతుంటే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లవుతున్నా..

నా భర్త చనిపోయి సుమారు రెండేళ్లవుతోంది. నేటికీ పెన్షన్ రావడం లేదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులను అడుగుతుంటే కొత్త పెన్షన్‌లకు నోటిఫికేషన్ ఇవ్వలేదని చెబుతున్నారు. దయచేసి పెన్షన్ ఇప్పించవలసిందిగా కోరుతున్నాను.

- అడపా భాగ్యలక్ష్మి, వేములవాడ, కరప మండలం.

ఎదురు చూస్తున్నా...



గతేడాది కాలం నుంచి వితంతు పెన్షన్ కోసం తిరుగుతూనే ఉన్నాను. అన్ని అర్హతలూ ఉన్నా కూటమి ప్రభుత్వం వెబ్ సైట్ ఓపెన్ చేయక కొత్త పెన్షన్లు రావడం లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని కొత్త పెన్షన్లను మంజూరు చేయాలి.

-చిట్టూరి సత్యవతి, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్.

పెన్షన్ రావడం లేదు

రెండేళ్ల నుంచి వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటున్నా. ఇప్పటి వరకు రాలేదు. కారణాలు అడుగుతుంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని చెబుతున్నారు. ఏ పనీ చేయలేకపోతున్నాను. అప్పులు చేసి జీవన సాగిస్తున్నాను. పెన్షన్ డబ్బులు వస్తే ఇబ్బందులు ఉండవు.

- పేరారపు మంగ, గండేపల్లి

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందే

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు తెలియజేసిన టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. జిల్లా యుటిఎఫ్ 4వ కౌన్సిల్ సమావేశం తునిలోని అతిథి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగింది. తొలుత పతాకావిష్కరణ కార్యక్రమం అనంతరం అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకట స్వామి, వాత్సవాయి సూర్యనారాయణరాజు, మైనేని వెంకటరత్నం తదితర నాయకులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందేనని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. మాజీ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాలే ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయని, ఉద్యమాల ద్వారానే మనం ఆశించిన ఫలితాలు సాధించుకోగలమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఈ రోజున ఉద్యోగ ఉపాధ్యాయులకు శరాఘాతంగా తయారయ్యాయని అన్నారు. పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్‌వర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు గారా చిట్టిబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలోనే యుటిఎఫ్ ఉద్యమం పురుడు పోసుకుందని గుర్తు చేశారు. సీనియర్ నాయకులు ఐ.ప్రసాద్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులపై చిన్న చూపు చూస్తున్నాయని అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికను జిల్లా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు భవిష్యత్ కార్యాచరణతోపాటు, పలు తీర్మానాలను సభలో ప్రవేశ పెట్టారు. రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి భవిష్యత్ కర్తవ్యాలను వివరించారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, నాగేశ్వరరావు

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎంవి.సాయిరాం, అధ్యక్షులుగా సిహెచ్.సూరిబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.గోవిందరాజులు, అసోసియేట్ అధ్యక్షురాలుగా బి.నాగమణి, ప్రధాన కార్యదర్శిగా కెవివి.నాగేశ్వరరావు, కోశాధికారిగా పివిఎన్.గణేశ్వరరావు, కార్యదర్శులుగా పెద్దిరాజు, సీతారామయ్య, పివివి.సత్యనారాయణ, సీతారామరాజు, జయప్రకాష్, నాగరాజు, ఆశీర్వాదం, వివి.రమణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా బాధ్యులు కిషోర్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంటివి.సుబ్బారావు, పి.సురేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ యువ కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక రాజా ట్యాంక్ వివేకానంద పార్క్ మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తులు ప్రదర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకురాలు కె. నాగజ్యోతి మాట్లాడారు. గంజాయి ముఠాల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయని అన్నారు. పాలకులు ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. యువతను, స్కూలు పిల్లలను లక్ష్యంగా చేసుకుని గంజాయి ముఠాలు వ్యాపారాలు సాగిస్తున్నాయన్నారు. నెల్లూరులో యువ కళాకారుడు పెంచలయ్య గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా యువతను చైతన్య పరుస్తున్నాడని అనానరు. పెంచలయ్య చేస్తున్న కృషిని తట్టుకోలేక గంజాయి ముఠాలు ఆయనను అతి కిరాతకంగా హత్య చేశారని అన్నారు. పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్.సతీష్, ఓలేటి శ్రీనివాస్, సిహెచ్. వేణు, యు.సత్యనారాయణ, పలివెల వీరబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మెయిన్ రోడ్‌లోని వినాయకుని గుడి సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అరుణ, యాసలపు రమేష్, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, కేదారి నాగు, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, డి సత్యవతి, స్నేహలత, రొంగల సుబ్బలక్ష్మి, సిరపరపు శ్రీనివాస్, నీలం శ్రీను, చల్లా దుర్గాప్రసాద్,రిబకా, బి చంటి, మహాలక్ష్మి పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యవర్గ సమావేశం పెంచలయ్య మృతికి సంతాపం ప్రకటించి మౌనం పాటించింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి వలన జీవితాలు నాశనం అవుతున్నాయని ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న నాయకుడిని హత్య చేయడం దారుణమన్నారు. వెంటనే హత్య చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మండలంలో జరుగుతున్న మట్టి మాఫియాను నిలువరించాలని అన్నారు. నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ బకాయిలు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎన్.త్రిమూర్తులు, జి.భాస్కరరావు, డి.వాసుదేవ, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పెద్దాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాళ్లరేవులో మాట్లాడుతున్న వ్యకాస నాయకుడు కెఎస్.శ్రీనివాస్

విద్యా పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రభుత్వ విద్యా పరిరక్షణకు విద్యార్థులందరూ ఐక్య ఉద్యమాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభ రెండో రోజు కొనసాగింది. ఈ సభకు ఎస్ఎఫ్ఐ నాయకులు జి.శ్రీకాంత్, సిహెచ్.సాహిత్, అమృత, లోవరాజు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు జి.చిన్ని స్వాతంత్రం ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాలతో కూడిన జెండాని ఎగురవేశారు. స్వాతంత్ర పోరాట వీరులు భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా గర్ల్స్ కమిటీ కన్వీనర్ చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగ సూరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షణ కోసం గత 55 సంవత్సరాలు నుంచి ఎస్ఎఫ్ఐ నికరంగా పోరాటాలు చేస్తుందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వివిధ దశల్లో ఆందోళనలు, పోరాటాలు చేయడంలో ఎస్ఎఫ్ఐ ముందున నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయన్నారు. వాటికి వ్యతిరేఖంగా విద్యార్థులు అందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. పిజి విద్యార్థులకు గుదిబండగా ఉన్న జిఒ నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజ్ రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కనీస సౌకర్యాలు లేక విద్యార్థుల సమస్యల వలయంలో చదువులు సాగిస్తున్నారన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాలు తక్షణం నిర్మించాలన్నారు. యు.కొత్తపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలో పిజి కళాశాల లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలలు సమయానికి అనుగుణంగా ఆర్‌టిసి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్ధు, సాహిత్, జయరాం, సంతోష్, తేజశ్రీ, విపిన్, మణికంఠ, నాని, తేజ, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

ప్రాథమిక చికిత్సపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రాథమిక చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అవసరమని, ముఖ్యంగా విద్యార్థులకు మరింత అవసరమని డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో సిపిఆర్ చేయడం, కట్లు కట్టడం, రక్తం పోకుండా ఆపడం, ఊపిరి ఆడకుండా ఉన్నవారికి కృత్రిమ శ్వాస అందించడం వంటి ప్రాథమిక చికిత్సలపై ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంసి పరాసర శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రయాణమూర్తి ప్రగడ, అధ్యాపకులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కెవి విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా సోమవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపురం 33/11 కెవి లైన్స్ పరిధిలో అన్ని ప్రాంతాలకు, అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు.

ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ధాన్యాన్ని మిల్లుకు త్వరితగతిన తరలించాలని మండల వ్యవసాయాధికారి నరసింహం ఆదేశించారు. ఆదివారం కాట్రావులపల్లి కళ్ళలలో ఉన్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. దిత్వ తుపాను ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని ఎత్తయిన ప్రదేశాల్లో భద్రపర్చాలని సూచించారు. అలాగే కోతలను, అకుమడులను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. సార్వా సాగు 10,230 ఎకరాలకు గాను 7,270 ఎకరాల్లో కోతలు అయ్యాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బంగారమ్మ గుడి వీధిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన తులసి సత్యనారాయణ కుటుంబానికి టిడిపి నాయకులు నిత్యవసరాలు, రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు, ఉల్లి సత్తిబాబు, సందక శ్రీను, శివ, మార్ని చిన్న, కడియం శ్రీను, సత్య పరదేశి, బచ్చు నమశ్శివాయ, కోకేడ భార్గవ, చంద్ర రావు, బేధంపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

శ్రీనువాస చౌదరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెదపూడి

డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వర్తించి పదవీవిరమణ చేస్తున్న మన్యం శ్రీనివాసు చౌదరి సేవలు అభినందనీయమని కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దాడ గ్రామంలో శ్రీనివాసు చౌదరి పదవీవిరమణ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసు చౌదరి విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించారన్నారు. అనంతరం శ్రీనువాసుచౌదరి, శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శులు ఎస్.కనక నాగేంద్ర, వాసంశెట్టి శ్రీనువాసు, కొమ్మన తరుణ్, జి.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



డ్రగ్స్ వద్దు బ్రో..సైకిల్ తొక్కు బ్రో...

ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాదక ద్రవ్యాల అనర్థాలపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీలు జరిగాయి. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసుల అధికారులు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎస్‌పి బిందుమాధవ్, ఎఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్, ఎఆర్ అడ్మిన్ ఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్‌బి డిఎస్‌పి కెవివి.సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, ఈగల్ విభాగం ఇన్‌ఛార్జ్ ఇన్‌స్పెక్టర్ పివి.సూర్యమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి బిందుమాధవ్ మాట్లాడుతూ వైద్యుల సిఫారసు లేకుండా మందులు అమ్మరాదన్నారు. స్కూల్, కళాశాలల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయించరా దన్నారు. మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక, సమస్యలను వివరించి, వాటిని వాడిన, కలిగిన, రవాణా చేసిన, కొనిన లేదా అమ్మిన వారికి చట్టంలో విధించే శిక్షలను వివరిఇంచారు. ఈ కార్యక్రమంలో స్కూలు అధ్యాపకులు, స్థానిక పోలీసులతో కలిసి స్కూల్ ఆవరణంలో 1972 టోల్ ఫ్రీ స్టిక్కర్స్‌ని అతికించి కరపత్రాలను పంచి ప్రతిజ్ఞ చేయించారు. **పెద్దాపురం** స్థానిక కొత్తపేటలోని గుర్రాల సెంటర్ నుంచి పోలీసులు, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్లే కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరి రాజు మాట్లాడారు. ఈ ర్యాలీలో పెద్దాపురం, సామర్లకోట సిఐలు విజయ శంకర్, కృష్ణభగవాన్, ఎస్ఐ వి. మౌనిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక ఎస్ఐ శివనాగుబాబు ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ నాగబాబు మాట్లాడారు. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బందితోపాటు, విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, యువకులు, సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.రఘునాథరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి బిందుమాధవ్

గండేపల్లిలో సైకిల్ ర్యాలీలో ఎస్ఐ శివనాగబాబు, సిబ్బంది

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

'ప్రజాశక్తి'తో పౌరసరఫరాల సంస్థ డిఎం దేవుల నాయక్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుల నాయక్ అన్నారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి (75 కిలోలు బస్తా) రూ.1792, సాధారణ రకానికి రూ.1777 కనీస మద్దతు ధరను అందిస్తోంది. 'ప్రజాశక్తి' ముఖాముఖీలో ఆయన మాట్లాడారు.

ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత..?

కాకినాడ జిల్లాలో 269 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ వేగవంతంగా జరుగుతుంది. ధాన్యాన్ని ఎంతైనా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రత్యేకంగా లక్ష్యం అంటూ ఏమీ లేదు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యం కొంత పచ్చిగా ఉంటుంది. తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉండకూడదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేని పరిస్థితుల్లో రైతులు యంత్రాల ద్వారా కోతలను తాత్కాలికంగా నిలుపుదల చేసుకోవాలి.

ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు.?

ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 20 ఆర్ఎస్‌కెల ద్వారా 15,990 మంది రైతుల నుంచి రూ.195 కోట్ల విలువైన సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. వారికి ఇప్పటి వరకు రూ.194 కోట్లు సొమ్ములు కొనుగోలు చేసిన 24 గంటల లోపే చెల్లించాం. సరిపడా గోనె సంచులు మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. అవసరమైన కాటాలు, తేమ యంత్రాలు ఉన్నాయి. కల్లాల్లోనే కాటా వేస్తారు.

ఫిర్యాదులు ఎలా చేయాలి.?

ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద రైతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఫోను ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చు. రైతులు తమ సమస్యలను టోల్ ఫ్రీ 1967 నంబరుకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఫోను చేసి సమస్యలను తెలియజేయవచ్చు.

ప్రయివేటు వ్యాపారులకు అమ్మకాలు నిజమేనా.?

ప్రభుత్వం విధించిన నిబంధన మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నాం. రైతులు ఎవరూ ప్రయివేటు వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకుని మోసపోవద్దు అని అవగాహన కల్పిస్తున్నాం. ఏ రైతు కూడా నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్న తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదు. దళారులు, మిల్లర్ల చేతిలో నష్టపోకూడదు. ఆర్‌బికెల ద్వారా ఎటువంటి మోసాలకు తావు ఉండకూడదు.

నిబంధనలు ఏమిటీ.?

ఇ-పంట నందు నమోదు చేసుకొని ఇకెవైసి పూర్తి అయిన రైతులు, తమ ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధమైన రైతుల వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయబడును. రైతు తాము అమ్మ దలచిన ధాన్యాన్ని వాట్స్ యాప్ ద్వారా కూడ షెడ్యూల్ చేసుకోవచ్చు. అందుకు గాను రైతు తమ వాట్స్ యాప్ ద్వారా నెం:7337359375కు హాయ్ అని పంపి షెడ్యూల్ చేసుకోవాలి. అంతే కాకుండా తమ అభిప్రాయాన్ని తెలియచేయవచ్చు.

సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా.?

ఆర్ఎస్‌కెలోని టెక్నికల్ సిబ్బంది ధాన్యం నాణ్యతను పరిశీలించడానికి రైతు కల్లం వద్దకే వెళ్తున్నారు. వారు ఏ రోజు వస్తారో కూపన్ ద్వారా తెలియపరుస్తారు. రైతులు ఆర్ఎస్‌కె నుంచి కూపన్ కచ్చితంగా తీసుకోవాలి. భారత ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను అనుసరించి నాణ్యతా ప్రమాణ పరీక్షలను (అంటే వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన, తక్కువశ్రేణి గింజలు, లేదా కేళీలు, తేమ పరీక్ష) నిర్వహించి నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. లేనిచో రైతులు తమ ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు లోబడే విధంగా మెరుగుపరచి సిద్ధం చేసుకోవాలి. రైతు విక్రయించిన ధాన్యాన్ని వాటి విలువ తదితర వివరాలతో రశీదును కొనుగోలు సమయంలో ఇవ్వడం జరుగుతుంది. రశీదు కచ్చితంగా తీసుకోవాలి.

వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేస్తున్నారా.?

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వాహనాలలో ఎగుమతి చేసిన దగ్గర నుంచి రైస్ మిల్లు వద్ద దిగుమతి అయ్యేవరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుంది. కనుక వాహన యజమానులు తమ వాహనాలకు జిపిఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చి మాత్రమే ధాన్యం రవాణా చేయాలి. ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలలో డబ్బులు నేరుగా జమ చేయబడతాయి.

రవాణా హమాలీ ఛార్జీలను ఎప్పుడిస్తారు.?

రైతు గోనె సంచులు కానీ, హమాలీలు కానీ, రవాణా కానీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం లెక్కల ప్రకారం పైకాన్ని నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లించబడుతుంది. పై సేవలకు ప్రభుత్వం చెల్లించే సొమ్ము వివరాలు మీ రైతు సేవా కేంద్రంలో తెలుసుకోవచ్చు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి భార్యకు గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు గాయాల చికిత్స పొందుతుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాడిపల్లి గ్రామానికి చెందిన మాధవరపు అయ్యన్న(74) తన భార్య అనంతలక్ష్మితో కలిసి మోపెడ్ మోటార్ సైకిల్‌పై ద్రాక్షారామం వస్తున్నారు. తోటపేట నుంచి వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వీరి వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అయ్యన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని వెంటనే రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. భార్య అనంతలక్ష్మికి గాయాలు కాగా ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామం అడిషనల్ ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె. కొత్తూరులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం ఎస్ఐ టి.రఘునాథ రావు, సిబ్బంది దాడ చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చేశారని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు.

బైకు పైనుంచి పడి తండ్రీ కుమార్తెలకు గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో రాజమహేంద్రవరం-సీతానగరం రహదారిపై ఆదివారం చోటు చేసుకున్న ప్రమాదంలో బైకు పైనుంచి పడి తండ్రి, ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై ధాన్యం ఆరబోయగా, దానికి అడ్డుగా ఉంచిన కర్రను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ముగ్గళ్లకు చెందిన బొల్లిన లక్ష్మణరావు తన కుమార్తెలు వీరలక్ష్మి, హర్షితతో కలిసి బైకుపై వెళుతున్నారు. ముగ్గళ్ల వద్ద రహదారిపై రైతులు ధాన్యం ఆరబోసి, వర్షం పడుతోందని టార్పాలిన్ కప్పి, గాలికి ఎగిరిపోకుండా లావుపాటి దుంగలు, కర్రలను అడ్డుగా ఉంచారు. లక్ష్మణరావు బైకు కర్రలపైకి ఎక్కడంతో అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో తండ్రి, ఇద్దరు కుమార్తెలకు ముఖానికి, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దేవరపల్లిలో...

యర్నగూడెంకు చెందిన ముగ్గురు యువకులు బైకు పైనుంచి పడి గాయాల పాలైన సంఘటన ఆదివారం సూర్యనారాయణపురం సర్వీస్ రోడ్డులో చోటు చేసుకుంది. ధాన్యం బరకాల కింద ఉన్న రాళ్లను గుర్తించలేక బైకు ప్రమాదానికి గురయ్యింది. స్థానికులు గాయపడిన యువకులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

వ్యాన్ బోల్తా పడి పలువురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

పోచమ్మ గండికి వెళ్లి తిరిగి వస్తున్న యాత్రికులు వ్యాన్ బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డారు. సీతానగరం దేవీపట్నం మండలాల సరిహద్దులోని పురుషోత్తపట్నం సత్యసాయిబాబా డ్రింకింగ్ వాటర్ సమీపంలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. యాత్రికులు ప్రయాణిస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వ్యాన్ డ్రైవర్ మద్యం సేవించి నియంత్రణ కోల్పోవడం వల్లనే ఈ సంఘటన జరిగినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో సీతానగరం పిహెచ్‌సికి తరలించారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సెప్టెంక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న వాహనదారుడు

సర్వీస్ సెంటర్‌గా మారిన మంచినీటి వాల్వ్

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం పట్టణ ప్రజలకు గోదావరి రక్షిత జలాలను సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ వాహనాలను శుభ్రపరచే వాటర్ సర్వీస్ సెంటర్‌గా మారిపోయింది. సామర్లకోట- ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలో ఉన్న పెద్దాపురం తాగునీటి పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ వద్ద లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. అయితే దీనితో ఆగిపోకుండా, ఆ లీకేజీ నీటిని ఆటోలు, గ్రావెల్ లారీలు సహా పలు వాహనదారులు తమ వాహనాలను శుభ్రం చేసేందుకు వినియోగిస్తున్నారు. గతంలో పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రాంతాన్ని పరిశీలించి, ఇక్కడ ఎలాంటి వాహనాలు కడగరాదని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కొద్దిరోజుల వ్యవధిలోనే పరిస్థితి మళ్లీ పునరావృతం అయింది. వాహనాల శుభ్రపరచడం వల్ల వెలువడే మట్టి, వ్యర్థాలు పైప్‌లైన్‌లోకి చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పెరుగుతుంది. ఆదివారం ఉదయం సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని అదే ప్రాంతంలో శుభ్రం చేస్తూ కనిపించడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం యాత్రికులకు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలతో హైటెన్షన్

-హైటెన్షన్ వైర్ల కింద నిర్మాణాలు
-భారీ భవంతులతో బరితెగింపు
-అటువైపు చూడని అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పల్లె ప్రాంతాలు, పట్టణ, నగర ప్రాంతాల్లో 11కెవి, 33 కెవి లాంటి విద్యుత్ లైన్ల కారణంగా ఏటా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగిన అనేక మంది మృతి చెందుతున్నారు. పలు సంఘటనల్లో ఆస్తి నష్టాలు జరుగుతున్నాయి. అలాంటిది 132, 220, 400 కెవి హెచ్‌డి హై టెన్షన్ లైన్లు తాకితే దానివల్ల జరిగే నష్టం ఊహకే అందని పరిస్థితి. అటువంటి లైన్ల కింద కొందరు అక్రమార్కులు భారీ భవంతులు నిర్మిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గృహాలు, షాపులు హైటెన్షన్ లైన్ల కింద నిర్మాణాలు జరిగిపోతున్నా అటువైపు సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

'అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం' అని పంచాయతీ అధికారులు చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు. ప్రమాదకరంగా నిర్మాణాలు జరుగుతున్నా.. బాధ్యతగా వ్యవహరించడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులు అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు. భవన నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నా.. ప్లానింగ్ నుంచి మొదలు అన్ని నిబంధనలు పాటించినా నిర్మాణ సమయంలో స్వల్ప తేడా వచ్చిందంటే చాలు.. పంచాయతీ అధికారులు ఆ నిర్మాణాన్ని అనుమతి లేని నిర్మాణంగా నమోదు చేస్తారు. ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఏటా చెల్లించే ఇంటిపన్నుకు అదనంగా రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారు. సామాన్యుల విషయంలో ఎంతో నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులు.. కొందరి విషయంలో మాత్రం తమ నిబంధనలను పక్కన పెట్టేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడి.. అసలు ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా అక్రమ నిర్మాణాలు చేసిన వారికి వత్తాసు పలుకుతుంటారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రమణయ్యపేట, వాకలపూడి పంచాయతీ పరిధిలో పలు చోట్ల హైటెన్షన్ విద్యుత లైన్ల కింద జరిగిన.. జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. లైన్ల కింద చేపట్టిన నిర్మాణాలతో ఏదైనా ప్రమాదం జరిగి.. ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే దానికి ఎవరు సమాధానం చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

హైటెన్షన్ వైర్ల కింద నిర్మించిన షాపులు, భవనాలు

ఇంటి నెంబర్లు కేటాయింపు

హై టెన్షన విద్యుత లైన్ల కింద చేసిన నిర్మాణాలకు అధికారులు ఇళ్ల నెంబర్లు కేటాయించడం గమనార్హం. దాని వెనుక పెద్ద ఎత్తున నగదు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయన్న వాదన విన్పిస్తోంది.

అసలు నిబంధన ఇదీ..

విద్యుత చట్టం 1956లోని 80వ రూల్ ప్రకారం హైటెన్షన లైన్లకు కనీస క్లియరెన్స్ పాటించాలి. కారిడార్‌కు 132 కెవి హై టెన్షన్ విద్యుత్ లైన్ టవర్‌కు మధ్య నుంచి ఇరువైపులా 13.50 మీటర్ల కనీస క్లియరెన్స ఉండాలి. లైన్‌కు అడ్డంగా 2.90 మీటర్లు, నిలువుగా 4.60 మీటర్లు ఉండాలి. అలాగే 220 కెవి లైన్‌కు టవర్ మధ్య నుంచి ఇరువైపులా 17.50 మీటర్లు, 400 కెవి నుంచి 52 మీటర్లు కనీస క్లియరెన్స్ ఉండాలి. కానీ ఇక్కడ అటువంటి నిబంధనలు తమకు వర్తించవనే రీతిలో అక్రమ నిర్మాణదారులతోపాటు, పంచాయతీ అధికారుల వ్యవహరించడం విశేషం.

అక్రమ కట్టడాలపై చర్యలు

అక్రమ కట్టడాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి తగిన చర్యలు చేపడతాం. అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. తీసుకున్న అనుమతుల ప్రకారం మాత్రమే భవనాల నిర్మాణం చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించే భవన యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

-పి.సతీష్, ఎంపిడిఒ, కాకినాడ రూరల్

యానాం వార్తలు

సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్‌పి

కోన సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీస్ శాఖలో గత 38 సంవత్సరాలుగా అనేక సేవలందిస్తూ ఆదివారం యానాంలో ఉద్యోగ విరమణ చేస్తున్న కోన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలు అభినందనీయమని ఎస్‌పి వరదరాజన్ అన్నారు. ఆదివారం యానాం పోలీస్‌ల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పునీత్ రాజ్, శేరు నూకరాజు, రిటైర్డ్ సిఐ గూటం శివగణేష్, సహచర ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్యానందం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

మద్దింశెట్టి సత్యానందంకు నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా పని చేసిన మద్దింశెట్టి సత్యానందం వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ ఆసుపత్రి డీడీ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు, ఎస్‌పి వరదరాజన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పునీత్ రాజ్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, జియ్యన్న, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో పల్లవి ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడలో మూడు రోజులపాటు జరిగిన 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జిఎఫ్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో మండలంలోని రాయభూపాలపట్నంకు చెందిన మన్యం పల్లవి ద్వితీయ స్థానం సాధించిందని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ జిమ్నాస్టిక్స్ కోచ్ ఎన్.సురేష్ తెలిపారు. అండర్ 14 విభాగంలో ఫ్లోర్ ఈవెంట్లో పల్లవి ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో కలకత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పల్లవి పాల్గొంటుందన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయంలో లయన్స్ ఇంటర్నేషనల్ 3వ వైస్ ప్రెసిడెంట్ వి.విజయ్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామర్లకోట లయన్స్ క్లబ్ భీమేశ్వర ఆధ్వర్యంలో జరుగుతున్న లయన్స్ జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన తొలుత భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ ఆయనకు చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, క్లబ్ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెద్దాపురం మండలంలోని వడ్లమూరు, జి.రాగంపేట గ్రామాల్లో వైసిపి శ్రేణులు సంతకాల సేకరణ చేపట్టారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కంటే ప్రభావతి, వైసిపి రాష్ట్ర నాయకులు కంటే వీరరాఘవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం మండలంలోని విరవ గ్రామంలో మండల వైసిపి మహిళ విభాగం అధ్యక్షురాలు ఆర్.భవాని ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రఘు, కొత్తేం దత్తుడు, వర్ధినీడి సుజాత, నాగమల్లేశ్వరి, శ్రీను, భూషణం, ముమ్మిడి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలు ప్రయోజనకరం

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలు ఎంతో ప్రయోజకరంగా ఉంటాయని స్థానిక అయోధ్యరామపురం మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు రాజమహేంద్రవరంలోని సైన్స్ సిటీ, కాటన్ బ్యారేజ్, మ్యూజియం, రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి, ఇస్కాన్ టెంపుల్, కడియం నర్సరీలను సందర్శించారని తెలిపారు. ఈ పర్యటనకు బస్సు సౌకర్యం కల్పించిన ఆదిత్య యూనివర్శిటీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సర్పవరం సిఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సర్పవరం జంక్షన్‌లో విఎస్ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు తొలుత మన డేటా చోరీ చేస్తారని, అనంతరం దానిని పరిశీలించి అమ్మాయిలతో వాట్సాప్‌ల ద్వారా మెసేజ్‌లు పంపడంతో కొందరు వారి ఉచ్చులో పడుతున్నారని అన్నారు. తదుపరి వారి బెదిరింపులకు భయపడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ పట్ల అప్రమత్తంగా ఉంటూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్ యాప్‌లలో పాల్గొన వద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్, ఎటిఎం సమాచారాన్ని ఎవరికి షేర్ చేయవద్దన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే 1930 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. విద్యాసంస్థలే లక్ష్యంగా మత్తు పదార్థాల సరఫరా జరుగుతున్నందున వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలవాటు పడితే శరీరంలో అవయవాలన్నీ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నియమాలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ కె.సుకన్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమ సంఘానికి అండగా ఉంటా

ప్రజాశక్తి - కాకినాడ

బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. జిల్లా బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎంఎల్‌ఎను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, నగర అధ్యక్షులు కడలి నాగరాజులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంఘానికి ఏ విధమైన సహాయ సహకారాలైన ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ డిసెంబర్ 20న అమరావతిలో జరగబోయే బిసి ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

టిడిపి మండల అధ్యక్షులు దూళిపూడి వెంకటరమణ పుట్టిన రోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. అనంతరం సిఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన చెక్కులను 14 మంది లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ అందజేశారు. పి.మల్లవరం పెద్దపేటకు చెందిన పలువురు బాబి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.

150 మందికి ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని పి.నాయకంపల్లిలో వైసిపి యువ నాయకులు మలిరెడ్డి పాపారావు అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. విక్టరీ డయాగ్నొస్టిక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో మెడికవర్ వైద్యులు డాక్టర్ నందిపాటి ముఖేష్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి సురేష్‌కుమార్, ఉండవల్లి సత్యనారాయణ, కదిలిండి శివ, పాపారావు యువసేన సభ్యులు, మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ముఖేష్

ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఐ వెంకటేశ్వరరావు లారీ యాజమాన్యాలకు సూచించారు. ఆదివారం మండలంలోని ఎస్.పైడిపాల గ్రామ ప్రజలు, లారీ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ వాహనాల రాకపోకలు, శబ్ద, వాయు కాలుష్యంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వివరించారు. భారీ లారీల రవాణాతో రహదారి అంతా గోతులమయంగా మారిందని తెలిపారు. రహదారిని నిరంతరం నీటితో తడిపి దుమ్ము దూలి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు. గ్రామం మధ్యలో పాఠశాల ఉండడంతో వాహనాలు వేగా నియంత్రణ చర్యలు చేపట్టడంతోపాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వాహనాలను అడ్డుకుంటామని అన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఆదివారం మండల అధ్యక్షులు పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ 2025-26 సవరణ, 2026-27 సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా ఆదాయం రూ.93,31,80,400 లుగా, అంచనా వ్యయాలు రూ.93,30,92,600లుగా రూ.87,800 మిగులుగా పాలకవర్గం ఆమోదించింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్‌రెడ్డి, కార్యాలయం ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కృషి చేసిన ఎస్‌ఎ-ఎస్.కామేశ్వరరావుకు విద్యుత్ ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక విద్యుత్ శాఖ డిఇ కార్యాలయంలో కామేశ్వరరావు 52వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.జాన్‌వెస్లీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఇ ఎన్.ఉదయ్‌భాస్కర్, ఎడిలు వీరభద్రరావు, మురళీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ పిల్లి నాగేంద్ర, ఎం.హరిబాబు, వీరబాబు, చలం, రమణ, జి.శ్రీనివాస్, రాజు, సునీల్‌కుమార్, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం

E.P.No.143/2025 in O.S.No.1046/2019

Between:-
Kadimi Mahesh Son of Yesudas, aged 35 years, resident of D.No. 37-1-10, Sivaram lab back side, innespeta Rajamahendra varam, E.G.Dt. ...Decree Holder
And
Nalla Lakshman Rao son of Surya rao, Hindu, aged 54 years, resident of D.No.16-35/1, Gollapeta, Dowleswaram, Rajama hendravaram rual, E.G.Dt ...Judgment Debtor

పై నంబరు E.P. లో JDR అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.24-12-2025** సం॥రం తేదీ ఉదయం **10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై E.P.లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు E.P.ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
ఎ.సాయి కిరణ్ కుమార్
అడ్వకేట్
రాజమండ్రి రాజమండ్రి
01-12-2025 సెల్.9703331555

పాస్ పోర్టు పడిపోయినది

నా పేరు వరసాల మంగాదేవి భర్త: శ్రీనివాసరావు, విత్తనాలవారిపాలెం వన్నె చింతలపూడి డోర్.నెం. 5-1-95 అమలాపురం, నా పాస్ పోర్టు జిరాక్స్ తీయించుకొనేందుకు **ది.05.11.2025** తేదీన మా ఇంటి వద్ద నుండి అమలాపురంలో జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా మార్గ మధ్యలో నా పాస్ పోర్టు నెం. **Y 5758435** పడిపోయినది. దయచేసి దొరికిన వారు నా అడ్రసుకు పంపించకోరు చున్నాను.

వరసాల మంగాదేవి
భర్త: శ్రీనివాసరావు
వన్నె చింతలపూడి,అమలాపురం మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
జిల్లా,పిన్:533201,సెల్:7661863776.

**PUBLICATION
IN THE COURT OF THE
HON'BLE CIVIL JUDGE JUNIOR
DIVISION AMALAPURAM
OS.No.230/2020**

Between
Bank of Baroda, Amalapuram branch Rep by its Senior Manager cum GPA Holder (Previously Vijaya Bank) ...Plaintiff
And
Kollati Sai Sree, W/o. Bharath Kumar D.No 8-182, Near Vinayaka Temple, Vetlapalem Katrenikona Mandal-533434 ...1st defendant

The above named plaintiff has instituted the above suit for recovery of the suit amount against you, and the same stands posted to **26-12-2025** at **10.30 A M** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at **10.30 AM** and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

(by the Orders of the Hon'ble court)
DVVS Murthy
Advocate,
Amalapuram Amalpuram
Dt.30-11-2025 Cell.98483 44577

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్‌డివిజన్) అమలాపురం వారి కోర్టులో

EP.No.3/2023, O.S.No.170/2012

Between:-
పెమ్మిరెడ్డి సురేష్ ... Dhr
And
మొల్లేటి నరసింహామూర్తి ...JDR
S/o వీరంశెట్టి, వ్యాపారం, అమ్మనఅగ్రహారం,H/o గొల్లవిల్లి ఉప్పలగుప్తం మండలం.

ఈ నెంబరు JDR DHR కు చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని వేలంనకు తీసుకొని వచ్చుచున్నారు. సదరు వేలం ది **15-12-2025** తేదికి వాయిగా అయిఉన్నది. వేలంలో పాట పాడు కోనవలసినవారు వేలం తేదీన ఉదయం గం10.30ని॥ల నుండి పై కోర్టు వారి ఏదుట హజరయి పాట పాడుకోనవచ్చును. మిగతా వివరముల హైకోర్టు నజరత్ ఆఫీసు నందు అడిగి తెలుసుకొనవలెను.

SCHEDULE FILED BY THE DHR

East Godavari District, Amalapuram SRO, Uppalaguptam Mandal, Gollavalli Grampanchayat, Gollavilli Village, Zeroiti Dry, an extent of **ac.0.10** cents out of full **ac.0.38** cents in R.S.No.238/2 bounded by.
East : Land of Kudupudi Danayya
South : Land of Donga Krishnamurty
West : Land of Defendant family
North : Land of Donga Veereswararao
D.H.R విలువ: 1,00,000/-
అమీనా విలువ : 5,00,000/-

చింతపల్లి అజయ్ కుమార్
అమలాపురం అడ్వకేట్ అమలాపురం
30-11-2025 Cell:9849864699